సాక్షి చిత్తూరు

శనివారం । 10 । ఆగస్టు । 2024



గిరిజన విద్యార్థుల ఉన్నతికి కృషి

చిత్తూరులో శుక్రవారం ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేసీ పాల్గొన్నారు. - 8లో



మాయదారి 'బిల్లు'కు టీడీపీ మద్దతు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు పలకడంపై ముస్లింలు మండిపడుతున్నారు. - 8లో



ప్రజలకు మెరుగైన వైద్యం

ఐరాల మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీని శుక్రవారం డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఏపీఐఐసీ భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న కలెక్టర్, ఏపీఐఐసీ ఎండీ

విజయపురం : మండలంలోని కోసలనగరంలో ఏపీఐఐసీ భూములను కలెక్టర్ సుమిత్ కుమార్, ఏపీఐఐసీ ఎండీ యువరాజ్ శుక్రవారం పరిశీలించారు. యువరాజ్ మాట్లాడుతూ ఏపీఐఐసీకి కేటాయించిన భూములను సర్వే చేయించి రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించాలని సూచించారు. అలాగే మరో 470 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలని చేపట్టాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ , తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి సేవించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆమెకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించి శేష వస్త్రాలతో సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అధికారులు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి సూపరింటెండెంట్ కోదండపాణి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి, తహసీల్దార్ మహేష్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 14న విద్యుత్ ఓసీ ఉద్యోగుల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశాన్ని సెప్టెంబర్ 14వ తేదీన చిత్తూరులో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, చంద్రమౌళిరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్థానిక సంతపేట సమీపంలోని ఓ హోటల్‌లో సమావేశం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పంద్రాగస్టు వేడుకలకు మంత్రి సత్యకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విచ్చేయనున్నారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా కేంద్రంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేయనున్నట్లు పేర్కొన్నారు.

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించే స్థాయికి టీడీపీ నేతలు బరితెగించారు. దేశానికే దిశానిర్దేశం చేసిన మహనీయుని విగ్రహంపై దాడి చేసే అథమస్థాయికి దిగజారిపోయారు. చిరస్మరణీయ సేవలందించిన ఆదర్శ మూర్తికి తీరని అపచారం చేశారు. సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడలో ప్రతిష్టాత్మకంగా కొలువుదీర్చిన బడుగుల దేవుడి ప్రతిమను కూలగొట్టేందుకు యత్నించారు. చివరకు శిలాఫలకం ధ్వంసం చేసి రాక్షసానందం పొందారు. పచ్చమూక వికృత చేష్టలపై దళిత.. ప్రజాసంఘాలు భగ్గుమన్నాయి. శుక్రవారం జిల్లావ్యాప్తంగా కదంతొక్కాయి. బాబాసాహెబ్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశాయి. కనీసం మాత్రం పట్టించుకోని అధికారులు.. పోలీసుల తీరుపై నిరసన తెలిపాయి. అణుమాత్రం స్పందించని కూటమి సర్కారు విపరీత వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

– చిత్తూరు రూరల్ (కాణిపాకం)



బంగారుపాళెంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

అప్రజాస్వామిక చర్య

బంగారుపాళెం: అంబేద్కర్ విగ్రహంపై దాడి అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. దళిత నేతలతో కలిసి నిరసన తెలిపారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికి తలమానికంగా అంబేద్కర్ విగ్రహాన్ని రూ 404.35 కోట్లతో జగనన్న అద్భుతంగా ఏర్పాటు చేశారన్నారు. గురువారం రాత్రి అంబేద్కర్ స్మృతివనంలోకి చొరబడిన టీడీపీ శ్రేణులు సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేయడానికి బరితెగించడం హేయమైన చర్యని మండిపడ్డారు. ఇటువంటి దుర్మార్గమైన పనులు చేయడానికేనా టీడీపీకి ప్రజలు అధికారం కట్టబెట్టింది అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం అన్నివర్గాలకు స్ఫూర్తినిస్తోందన్నారు. అటువంటి మహాశిల్పంపై జరిగిన దాడికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మొగిలీశ్వర, సింగిల్ విండో మాజీ చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఉప సర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ సభ్యుడు హరి, మాజీ సర్పంచులు అరుణామల్‌రెడ్డి, గోవిందరాజులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నబ్బ, మండల యూత్ అధ్యక్షుడు జగదీష, ఎస్సీ సెల్ నేతలు గోవిందన్, సుబ్రమణ్యం, విజయకుమార్, మునీంద్ర, కుమార్‌స్వామి, బాలాజీ, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు హిదాయత్, నాయకులు షాకీర్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

భగ్గుమన్న బడుగులు

విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ దాడి

- శిలాఫలకం ధ్వంసం చేస్తున్నా పట్టించుకోని అధికారులు
- కనీస మాత్రం స్పందించని పోలీసులు
- పచ్చ మూక పైత్యంపై మండిపడుతున్న దళిత, ప్రజా సంఘాలు

టీడీపీ నేతల దాడి దారుణం



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ నేతల దాడి దారుణం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం రావణకాష్టంలా మారిపోయింది. మహనీయుల విగ్రహాలను కూడా వదలడంలేదు. పచ్చమూక దుశ్చర్యలను పోలీసులు పట్టించుకోకపోవడం సరికాదు. దేశం యావత్తూ దైవంగా ఆరాధించే అంబేద్కర్‌ను కించపరిచిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి. – భరత్, ఎమ్మెల్సీ

బాబు మాటలు మరువలేం



విజయవాడలోని అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును టీడీపీ కార్యకర్తలు తొలగించడం దుర్మార్గం. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేస్తున్న కుట్రే. దళితులంటే చంద్రబాబుకు గిట్టదు. గతంలో దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అన్న చంద్రబాబు మాటలను ఎన్నటికీ మరువలేం. – నాగార్జున, ఐరాల

క్షమాపణ చెప్పాలి



అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడి తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు పాల్పడిన వారికి గుర్తించి కఠినంగా శిక్షించాలి. అంబేద్కర్ అనే వ్యక్తి రాజకీయ నాయకుడు కాదు. ఆయన రాజ్యాంగ సృష్టికర్త, ప్రతి జాతి, కుల, మతానికి చెందిన వ్యక్తి. ఆయన విగ్రహంపై దాడి చేయడం చాలా అమానుషం. ఇలాంటివి మళ్లీ జరగకుండా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు, విజయపురం మండలం

రోడ్డుపైకి రావడం ఖాయం



రాజ్యాంగ నిర్మాత అని తెలిసీ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం సరికాదు. అంబేద్కర్‌ను ఒకవర్గానికే ఆపాదించి ఈ కుట్రలకు తెరలేపుతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీలు బయట అడుగుపెట్టాలంటేనే భయపడుతున్నారు. టీడీపీ నేతలు ఎస్సీల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఇలాగే కొనసాగితే దళితులంతా రోడ్డుపైకి రావడం ఖాయం. – ధనరాజ్, దళితసంఘ నేత, కల్లూరు

హేయమైన చర్య



విజయవాడ నడిబొడ్డున ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహంపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడటం హేయమైన చర్య. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలనే లక్ష్యంతో దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు, పోలీసుల సమక్షంలో దాడి చేయడం, వారు అడ్డుకోకుండా చూస్తూ ఉండడం దారుణం. ఇలాంటి చర్యలను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది.

– శేఖర్, దళిత సమాఖ్య నేత, బంగారుపాళ్యం

కఠినంగా శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహంపై దాడి పిరికిపందల చర్య. అధికసంఖ్యాకులైన దళితులను నేరుగా ఢీకొట్టలేక ఇలాంటి అకృత్యానికి ఒడిగట్టారు. ఇది దళితలోకంపై దాడిగా భావిస్తున్నాం. రాజ్యాంగ నిర్మాతకే రక్షణ లేకపోతే ఎలా. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయకుంటే సహించే ప్రసక్తే లేదు. ప్రభుత్వం స్పందించకుంటే తీవ్ర పరిణామాలను చూడాల్సి వస్తుంది.

– ప్రసాద్, దళిత సంఘం నేత, చిత్తూరు

కుల పిచ్చితోనే చేశారు



ఎస్సీలను అణగతొక్కాలనే ఉద్దేశంతోనే అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయించారు. ఎస్సీలను భయపెట్టాలని ప్రయత్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇలాంటి దాడులు పరిపాటి. కుల పిచ్చితోనే ఇలా చేశారు. ఎస్సీలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసే దుర్మార్గ చరిత్ర టీడీపీది. అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడి ఘటనపై ప్రతి ఒక్కరు స్పందించాలి.

– మగిమదాస్, దళిత క్రైస్తవ సంఘ నేత, జీడీనెల్లూరు

స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీకి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీలో స్థానానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్కావెంజర్ల కమిటీలో మొత్తం నలుగురు సభ్యులుంటారన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇద్దరు, పారిశుద్ధ్య కార్మికులు ఇద్దరికి కమిటీ స్థానం కల్పిస్తామని వివరించారు. అందులో ఒకరు మహిళా సభ్యులు కూడా ఉంటారని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్‌లోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయానికి రావాలని కోరారు. వివరాలకు 9347739382 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

27 మంది ఎంపీడీఓలు రిలీవ్

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన ఎంపీడీఓలను వారి సొంత జిల్లాలకు రిలీవ్ చేస్తూ జెడ్పీ సీఈఓ గ్లోరియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 30 మంది ఇక్కడికి రాగా అందులో ముగ్గురు ఎంపీడీఓలు ఉద్యోగ విరమణ చేయడంతో మిగిలిన 27 మందిని రిలీవ్ చేశారు. ఈ క్రమంలో ఇక్కడ నుంచి పక్క జిల్లాలకు వెళ్లిన ఎంపీడీఓలు త్వరలో జిల్లాకు రానున్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రౌడీ షీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని, నేర నియంత్రణకు నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు మండలంలోని బీఎన్‌ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. అందుబాటులోకి నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని సూచించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా కేసులను పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లోని అనుమాన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. స్కూల్స్, హోటల్స్ వంటి ప్రదేశాల్లో నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, కేసుల రికార్డులు, పెండింగ్ కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుబ్బమ్మ పాల్గొన్నారు.

రక్షకభటులకు కుల సంకెళ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుల వివక్ష పెరిగిపోయింది. ముఖ్యంగా పోలీసుశాఖ తీవ్రమైన ఒత్తిడికి లోనై కుదేలవుతోంది. శాంతిభద్రత పరిరక్షణ సంగతి వదిలేసి ఆత్మరక్షణలో పడిపోయింది. పోస్టింగ్ వస్తే చాలు అనుకునే దుస్థితిలోకి జారిపోయింది. సర్కారు సైతం పనితీరును పట్టించుకోకుండా కుల ప్రాతిపదికనే బదిలీల ప్రక్రియ చేపడుతోంది. తమ సామాజికవర్గానికి చెందిన అధికారులకే అగ్రతాంబూలం అందిస్తోంది. ఎస్సీ.. ఎస్టీ.. బీసీ.. రెడ్డి కులాలకు చెందిన వారిని పక్కనపెట్టేసి మానసిక్షోభకు గురిచేస్తోంది. ప్రజల కోసం ఆలోచించకుండా తమ ప్రాపకం కోసం పాకులాడే వారికే పదవులు కట్టబెడుతోంది.

- పోలీస్‌శాఖకు అంటిన క్యాస్ట్ మరకలు
- అనంతపురం రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాలో 18 మందికి లేని పోస్టింగ్‌లు
- ఎస్సీ, ఎస్టీ, రెడ్డి అయితే పక్కన పెట్టేయాలని మౌఖిక ఆదేశాలు
- కూటమి నేతల ఒత్తిడితో కుంగిపోతున్న రక్షక భటులు

చిత్తూరు అర్బన్: పోలీసు శాఖల్లో కుల ప్రస్తావన ఉన్నట్టుండి ఊడిపడింది కాదు. 2014– 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ కుల కల్లోలానికి తెర తీశారు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఐపీఎస్ అధికారులు పనిచేస్తే ముగ్గురు ఎస్పీ (ఐపీఎస్)లను తమ సామాజికవర్గానికి చెందిన వాళ్లనే ఇక్కడ పెట్టుకుని చక్రం తిప్పారు. పైగా స్పెషల్‌బ్రాంచ్, లా అండ్ ఆర్డర్ డీఎస్పీల్లోనూ అదే సామాజికవర్గ సూత్రమే పాటించారు. అంతటితో ఆగకుండా సీఐలు, ఎస్ఐలు, చివరకు కానిస్టేబుళ్లను సైతం కుల జాడ్యం వెంటాడింది. అప్పట్లో జరిగిన కానిస్టేబుళ్ల (పీసీ) బదిలీలో సిబ్బంది దరఖాస్తు చేసుకునే ఫామ్‌లో కులం ఏంటో పేర్కొనాలనే దుర్మార్గపు ఆలోచనను సైతం తొలిసారిగా తెరపైకి తీసుకొచ్చారు. 123 మంది ఎస్సీ, ఎస్టీ, రెడ్డి, బీసీ సామాజికవర్గానికి చెందిన కానిస్టేబుళ్లకు పోస్టింగులు ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారు. కుప్పం, సత్యవేడు, నగరి లాంటి సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రత్యేకించి స్పెషల్ బ్రాంచ్ విభాగాన్ని పూర్తిగా 'కమ్మ' సామాజికవర్గంతో నింపేశారు. ఈ అవమానాలు భరించలేక కుప్పంలో ఓ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు కూడా పాల్పడ్డారు.

తాజాగా సీఐల బదిలీల్లోనూ..

అనంతపురం రేంజ్‌లో 62 మంది సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షేముషీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో స్థానచలనం పొందిన సీఐల జాబితా పరిశీలిస్తే.. రేణిగుంట అర్బన్‌లో పనిచేస్తున్న టి.మల్లికార్జున, రేణిగుంట రూరల్‌లో పనిచేస్తున్న బి.సుబ్బరాయుడు, తిరుపతి వెస్ట్‌లో పనిచేస్తున్న జె.జయ నాయక్, తిరుమల సీసీఎస్‌లోని కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, చిత్తూరు వెస్ట్‌లోని ఐ.రవిశంకర్ రెడ్డి, చిత్తూరు టూటౌన్‌లోని కె.ఉలసయ్య, కార్వేటినగరంలో ఉన్న పి.సత్యబాబు, చౌడేపల్లెలో పనిచేస్తున్న ఎం.కృష్ణారెడ్డి, వి.కోటలోని ఎస్.లింగప్ప, తిరుపతి డీటీసీలో ఉన్న పి.జగన్‌మోహన్‌రెడ్డి, చిత్తూరు డీసీఆర్‌బీలోని కె.బాలయ్య, శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో ఉన్న ఎస్‌వీ నరసింహారావు, చిత్తూరు సీసీఎస్‌లోని బి.రామాంజనేయులుకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. పోస్టింగ్ దక్కనివారిలో ఐదుగురు షెడ్యూల్ కులాలు, ఒకరు షెడ్యూల్ తెగ, నలుగురు కాపు, ముగ్గురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులు ఉన్నారు. వీళ్లందరినీ వేకెంట్ రిజర్వుకు పంపాలనే ప్రభుత్వ పెద్దలు, జిల్లా పోలీసుశాఖలో పర్యవేక్షణ చేస్తున్న ఓ అధికారి సూచించడంతో ఈ విధంగా ఆదేశాలు వెలువడ్డాయి. ఇక తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఎ.శ్రీరాములును తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రానికి, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న జి.మురళీకృష్ణను రేణిగుంట రూరల్, అన్నమయ్యలో పనిచేస్తున్న పి.రామకృష్ణను తిరుపతి వెస్ట్, చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న పి.శేషగిరిని తిరుమల సీసీఎస్, తిరుపతి పీటీసీలో ఉన్న ఎం.మురళీని సత్యవేడు, కడప సైబర్‌సెల్‌లో ఉన్న వి.శ్రీధర్ నాయుడును చిత్తూరు వెస్ట్, తిరుపతి పీటీసీలో ఉన్న డి.నెట్టికంఠయ్యను చిత్తూరు టూటౌన్, అనంతపురంలో ఉన్న బొడ్డు ప్రసాద్‌ను గంగవరం, కర్నూలులో ఉన్న ఆర్.సోమశేఖర్‌రెడ్డిని వి.కోట, కర్నూలు ఆస్పరీలో ఉన్న ఎస్.హనుమంతప్పను కార్వేటినగరం, కడప సీసీఎస్‌లో ఉన్న ఎం.రాంభూపాల్‌ను చౌడేపల్లె, తిరుపతి పీటీసీలో ఉన్న ఎం.మహేశ్వర్‌ను నగరికి బదిలీ చేశారు. తిరుపతి సీసీఎస్‌లో ఉన్న కె.కళావెంకటరమణను తిరుపతి ట్రాఫిక్‌కు, అన్నమయ్యలో ఉన్న ఎస్.భాస్కర్‌ను చిత్తూరు డీఎస్‌బీ, కె.మద్దయాచారిని చిత్తూరు డీసీఆర్‌బీ, నగరిలో ఉన్న బీఎన్ సురేష్‌ను తొలుత చిత్తూరు వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులిచ్చినా సాయంత్రానికి ఆయనకు పుట్టపర్తి సర్కిల్‌ను కేటాయిస్తూ ఆదేశాలు వెలువడటంలోనూ కుల సమీకరణ ఉపయోగపడిందనే చర్చ వినిపిస్తోంది.



అదే పునరావృతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పోలీసుశాఖలో మళ్లీ కులాన్వేషణ మొదలైంది. డీఎస్పీల్లో ఎవరైనా రెడ్డి అని ఉంటే ముందు వాళ్లను పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని, అదే సీఐలకు అయితే వేకెంట్ రిజర్వు (వీఆర్)కు పంపాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇది ఒక్క ×రెడ్డి∓ సామాజిక వర్గంతో ఆగిపోలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 90 శాతం.. కాపుల్లో 60 శాతం మందికి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులనే ముద్రవేసి పోస్టింగులు ఇవ్వకుండా వీఆర్‌కు పంపుతున్నారు. ఫలితంగా అధికారులతో పాటు వారి కుటుంబాలు కూడా సమాజంలో తలెత్తుకోలేక, అవమానభారంతో చిన్నచూపునకు గురవుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇప్పటి వరకు వెలువడిన నాలుగు బదిలీ ఉత్తర్వుల్లో నలుగురు డీఎస్పీలకు పోస్టింగులు ఇవ్వకపోగా, మొత్తం 18 మంది సీఐలను వీఆర్‌కు పంపారు. ఇంతటితో ఇది ఆగిపోలేదు. ఇంకా రాబోయే డీఎస్పీ, సీఐ, ఎస్ఐల బదిలీల్లోనూ ఇదే తంతు కొనసాగనుంది.

'పచ్చ' చెర నుంచి చెరువులకు విముక్తి!



జేసీబీలతో హద్దులు వేయిస్తున్న దృశ్యం

గుడుపల్లె : మండలంలోని గుండ్లసాగరంలో ఉన్న చెన్నన్న చెరువు, బెచ్చని చెరువును స్థానిక టీడీపీ నేతలు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు. ఆయా చెరువుల్లో సగానికి కూడా నీరు లేకపోవడంతో ఖాళీగా కనిపించిన భూమిని కబ్జా చేసేశారు. దీనిపై గ్రామస్తులు ప్రశ్నిస్తే.. పక్కనే తమ స్థలం ఉందని, అందుకే ఈ భూమిని కూడా ఆక్రమించుకున్నామని దబాయించేవారు. అందులో కట్టడాల నిర్మాణం కూడా చేపట్టారు. దీంతో గ్రామస్తులు పలమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు గ్రామాని చేరుకుని పోలీసుల సమక్షంలో సర్వే చేపట్టారు. చెరువులకు హద్దులు వేయించారు. మళ్లీ ఎవరైనా చెరువుల స్థలాలను కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు కఠినంగా వ్యవహరించడంతో స్థానిక టీడీపీ నేతలు చేసేదిలేక వెళ్లిపోయారు. పచ్చ నేతల చెర నుంచి చెరువులకు విముక్తి కల్పించిన అధికారలుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యాలను అధిగమించేందుకు కృషి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లా సహకారం బ్యాంకు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు అధికారుల, సిబ్బంది కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు రుణాల పంపిణీల లక్ష్యం రూ. 2,500 కోట్లుగా నిర్దేశించామన్నారు. జూలై ఆఖరుకు రుణాల పంపిణీ నిల్వ మొత్తం రూ.1,996 కోట్లు ఉందని వెల్లడించారు. అలాగే డిపాజిట్‌ల లక్ష్యం రూ.1,114 కోట్లు నిర్దేశించగా ఇప్పటికే రూ.908.46 కోట్లకు చేరిందని వివరించారు. బ్యాంకులో మొండి బకాయిలు రికవరీకి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు బ్రాంచిల వారీగా జాబితాలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని చెప్పారు. బ్యాంకు అభ్యున్నతికి బ్రాంచ్ మేనేజర్లు సమష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు సీఈఓ మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏసీ, ఫ్రిడ్జ్ సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో 14వ తేది (బుధవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులకు రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్(ఏసీ) రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదివి ఉండాలని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, రానూ పోనూ ఒకసారి చార్జీకి నగదు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. శిక్షణానంతరం ధ్రువపత్రాలు అందజేస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్‌లు, 4 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. తొలుత పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తామని, మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

పశుసంవర్ధక శాఖ సూపరింటెండెంట్ బదిలీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్గా పనిచేస్తున్న రాఘవులును బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయనను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గెజిటెడ్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ చేస్తున్నట్లు పేర్కొంది.

మొగిలి ఘాట్‌లో మూడు వాహనాల ఢీ




ప్రమాదానికి గురైన లారీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లో శుక్రవారం సాయంత్రం మూడు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. వివరాలు.. కోలార్ నుంచి ఒడిశాకు వెళుతున్న లారీని వెనుక వస్తున్న కంటైనర్ ఢీ కొంది. దీంతో లారీ రహదారి పక్కన రైలింగ్‌ను ఢీకొనడంతో చక్రాలు ఊడిపోయాయి. అదే సమయంలో వస్తున్న కారు అదుపు తప్పి లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో వాహనాలు దెబ్బతిన్నాయి. ఎవరూ గాయపడలేదు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మాయదారి ‘బిల్లు’కు టీడీపీ మద్దతు!

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు పలకడం దారుణమని ముస్లింలు మండిపడుతున్నారు. ప్రాధాన్యత కలిగిన వక్ఫ్ చట్టం–1995లో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తే వంత పాడడం సరికాదని విమర్శిస్తున్నారు. ముస్లింల సంక్షేమంపై కనీసం ఆలోచించకుండా ఏకపక్షంగా ఆమోదం తెలిపేందుకు సహకరించడం క్రూరమని ఆరోపిస్తున్నారు. లోపాయికారీ ఒప్పందాలతో చంద్రబాబు తమను దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుట్రపూరితంగా ముస్లింలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇదే సమయంలో మైనారిటీ హక్కులకు భంగం కలిగించే బిల్లును ఎంతమాత్రం సహించమని పార్లమెంట్ వేదికగా గళం విప్పిన వైఎస్సార్‌సీపీ వైఖరిని అభినందిస్తున్నారు.



జిల్లాలోని ముస్లింల వివరాలు			
రెవెన్యూ డివిజన్	పురుషులు	మహిళలు	మొత్తం
చిత్తూరు	25,846	25,639	51,485
కుప్పం	93,315	3,029	18,344
నగరి	3,424	3,515	6,939
పలమనేరు	46,140	46,076	92,216
మొత్తం	84,725	84,259	1,68,984

- చంద్రబాబు వైఖరిపై మండిపడుతున్న ముస్లింలు
- వక్ఫ్ సవరణ బిల్లుకు అండగా నిలవడంపై ఆగ్రహం
- ముస్లింలకు అన్యాయం జరుగుతుందని బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ

చిత్తూరు కలెక్టరేట్ : పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడం క్రూరమైన విధానమని జిల్లాలోని ముస్లిం మత పెద్దలు, దర్గా కమిటీలు, ముస్లిం సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. వక్ఫ్‌చట్టం–1995లో మార్పులు తీసుకురావడం కరెక్టు కాదని ఆగ్రహం వ్యక్యం చేస్తున్నాయి. అలాగే చట్టం పేరును యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ, డెవలప్‌మెంట్ యాక్ట్ –1995 గా మారుస్తూ కేంద్రం రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లు సరైనది కాదని మండిపడుతున్నాయి. సమాజంలో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రవేశ పెట్టిన బిల్లు దారుణమైందని అభిప్రాయపడుతున్నాయి. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, సమాజాన్ని విచ్ఛిన్నం చేసేలా సవరణ బిల్లు ఉందని ముస్లిం మత పెద్దలు స్పష్టం చేస్తున్నారు.

వక్ఫ్ చట్టం అంటే ఏంటి?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా 1954లో వక్ఫ్ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. 1995లో తొలిసారిగా చట్టాన్ని సవరించి వక్ఫ్ బోర్డుకు మరిన్ని అధికారాలను అప్పగించింది. ఆ తర్వాత 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ మరోసారి సవరణలు చేసింది. వక్ఫ్ బోర్డులకు విశేష అధికారాలను కల్పించింది. వక్ఫ్ బోర్డు నిర్ణయాలను ఏ కోర్టుల్లోనూ సవాల్ చేయలేని విధంగా ప్రత్యేక అధికారాలను అప్పగించింది.

సవరణ బిల్లుకు టీడీపీ సహకారం

వక్ఫ్‌బోర్డుపై దురుద్దేశపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం సవరణ బిల్లు ప్రవేశ పెట్టిందని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సవరణ బిల్లును వ్యతిరేకించాల్సిన టీడీపీ ఎలా మద్దతు ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు. ముస్లింల ప్రయోజనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు విస్మరించారని మండిపడుతున్నారు. సవరణల బిల్లు చట్టరూపం దాల్చితే వక్ఫ్ బోర్డుల నామమాత్రంగా మిగిలిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ముస్లింలకు అన్యాయం చేసే బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిచ్చు పెట్టేందుకే..



ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఇది చాలా బాధాకరం. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ప్రవేశపెట్టడం సరైన పద్ధతికాదు. వక్ఫ్ బోర్డుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి బోర్డులో ఇప్పుడు సవరణలు తీసుకురావడం ఏంటి? ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాం. ఇందులో టీడీపీ వైఖరి దారుణంగా ఉంది. చంద్రబాబు మరోసారి ముస్లింలకు ద్రోహం చేస్తున్నారు.

– మౌలానా ఇమ్రాన్ హజ్రత్, ఇమామ్ కమిటీ సభ్యుడు, చిత్తూరు

భూముల అమ్మేస్తారు



ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం వక్ఫ్‌బోర్డు భూములకు భద్రత ఉంది. అలాంటిది సవరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటే భూములను కూడా ఇష్టారాజ్యంగా అమ్మేస్తారు. ముస్లింల హక్కులను హరించేలా కేంద్రంతో కలిసి టీడీపీ వ్యవహరిస్తోంది. ఇది సరైన ధోరణి కాదు. ముస్లింలను చిన్నచూపు చూడడం మంచి పద్ధతి కాదు.

– షేక్ అస్లామ్ హుస్సేన్, ముస్లిం ఏక్తా మంచ్ అధ్యక్షుడు, చిత్తూరు

వ్యతిరేకిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకిస్తున్నాం. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం కరెక్టు కాదు. ఏ ఉద్దేశంతో సవరణ బిల్లును ప్రవేశపెడుతున్నారో బహిరంగంగా తెలియజేయాలి. ఆ బిల్లుకు ఏ ప్రాతిపదికన మద్దతు పలికారో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేయాలి. ఆగమేఘాల మీద సవరణ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టారో.. అందులో మర్మం ఏంటో వెల్లడించాలి.

– మహమ్మద్ జాన్, జీడీ నెల్లూరు

సవరణలు సరికాదు



ఇష్టానుసారంగా చట్టంలో సవరణలు చేయడం సరైన విధానం కాదు. సవరణ బిల్లును పూర్తిగా ఖండిస్తున్నాం. ముస్లింలపై కేంద్ర ప్రభుత్వం, చంద్రబాబు ఎంత ద్వేషం పెంచుకున్నారో ఈ బిల్లును చూస్తే అర్థం అవుతోంది. ఇవి ఎవరికి ప్రయోజనం కలిగిస్తాయో తెలియడం లేదు. ముస్లింలకు మేలు చేయాల్సింది పోయి అన్యాయం చేస్తారా. ఇందుకు టీడీపీ మద్దతు పలకడం దారుణం.

– మౌలానా విరాసత్ అలీ, ముస్లిం మత గురువు

వెనక్కు తీసుకోవాలి



ముస్లింలకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం అభినందనీయం. సభలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ పక్ష నేత, ఎంపీ మిథున్‌రెడ్డి వ్యతిరేకించి ముస్లింల పక్షాన నిలవడం ఆనందంగా ఉంది. ఈ బిల్లును మరింత ముందుకు తీసుకెళితే ఆందోళన తప్పదు. టీడీపీ సైతం తమ వైఖరిని మార్చుకోవాలి. ఈ బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలి. ఈ మేరకు టీడీపీ ఒత్తిడి చేయాలి.

– సాధిక్‌బాషా, చౌడేపల్లె మండలం

ప్రజలకు మెరుగైన వైద్యం

ఐరాల : పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, రోగుల నమోదు, వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు నిర్వహించిన వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. వారికి అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులకు స్పష్టం చేశారు. ప్రభుత్వాస్పత్రులలోనే ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ క్రమంలోనే తిరువణంపల్లెలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించుకోవచ్చని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపించినా దోమల బారిన పడాల్సి ఉంటుందన్నారు. దోమల కారణంగా ప్రాణాంతక మలేరియా, డెంగీ, ఫైలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు సోకుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మలేరియా నివారణ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, మలేరియా అసిస్టెంట్ అధికారి రామచంద్రారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ మనోహర్, పబ్లిక్ హెల్త్ నర్స్ వేదవతి పాల్గొన్నారు.

రోడ్డు పక్కన కాలం చెల్లిన మందులు!

విజయపురం : మండలంలోని కలియంబాకం వద్ద ప్రధాన రహదారి పక్కనే భారీగా ఔషధాలను పడేయడం స్థానికంగా కలకలం రేపింది. గుట్టలుగా పారబోసిన మందులను అక్కడే దహనం చేస్తున్నారు. అందులో కొన్ని కాల పరిమితి ముగిసినవి కాగా, మరికొన్నింటికి ఇంకా గడువు ఉంది. కాలపరిమితి ముగిసిన మందులను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించాలి, లేదా సంబంధిత కంపెనీలకు తిరిగి పంపాల్సి ఉంటుంది. అలా చేయకుండా జనావాసాలు మధ్య పడేయడంతో పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి కాలం చెల్లిన ఔషధాలను పడేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహన చట్టంపై అవగాహన అవసరం

చిత్తూరు కలెక్టరేట్ : మోటార్ వాహన చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో మోటార్ వాహన చట్టం అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఈ ఉత్తర్వులు జూన్ 1 వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. నూతన చట్టంలోని నిబంధనలు కఠినంగా ఉన్నాయన్నారు. గతంలో జరిమానాలతో సరిపెట్టేవారని, ఇప్పుడు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు చేశారని వివరించారు. మైనర్ వాహనం నడిపితే తల్లిదండ్రులు, సంరక్షకులకు మూడేళ్ల జైలుశిక్ష , రూ.25 వేల జరిమానా విధిస్తారన్నారు. మైనర్ రైడింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్, స్నేక్ డ్రైవింగ్ ఇలా రకరకాల డ్రైవింగ్‌లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా సౌండ్ హారన్‌లను తయారుచేసిన కంపెనీలు, విక్రయించిన వారిపై కేసులు తప్పవని స్పష్టం చేశారు. డీలర్లకు రూ.లక్ష వరకు జరిమానా, ఇన్సూరెన్స్ లేని వాహనాలు పట్టుబడితే మొదటి తప్పిదానికి 3 నెలల జైలు శిక్ష రూ. 2వేల జరిమానా, రెండోసారి పట్టుబడితే జైలు శిక్ష తో పాటు రూ.4 వేలు జరిమానా ఉంటుందని వివరించారు. అనవసరంగా హారన్ మోగిస్తే మొదటి తప్పిదానికి రూ.వెయ్యి, ,రెండవసారి అదే తప్పిదం చేస్తే రూ.2వేలు చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. అతి వేగంగా డ్రైవింగ్ చేస్తే రూ.1వెయ్యి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపితే రూ. 10వేలు, వాహనం తనిఖీ చేయడానికి నిరాకరిస్తే రూ.750 జరిమానా విధిస్తారని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే మొదటి తప్పుగా రూ.10వేల జరిమానాతో పాటు ఆరు నెలలు జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే రూ.15వేల జరిమానా,3 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోతే రూ.10వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేల జరిమానా తప్పదని వివరించారు. కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చదలవాడ హరిబాబు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఆరంభం.. బ్రహ్మోత్సవం

- వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి తిరునాళ్ల
- ధ్వజారోహణంతో మొదలైన ఉత్సవాలు
- మహిళల సుమంగళి పూజలు



సుమంగళి వ్రతం చేస్తున్న మహిళలు

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి ఈ మేరకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు.. సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ ఘట్టాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభానికి పూజలు చేసి ధ్వజ పట ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడు పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. 7 గంటలకు గోపూజ, శ్రీకృష్ణుడికి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం చేపట్టిన సుమంగళి వ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి స్వర్ణలత నేతృత్వంలో హరికథా కాలక్షేపం జరిపించారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను సాక్యాకం వంశీకులైన ఆలయ కోవిల్‌కార్లు ఏలుమలైమొదలి, నటరాజ్‌మొదలి, గోపీ మొదలి, వెంకటేష్ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామిమొదలి పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శనివారం ఉదయం తీర్థోత్సవం ప్రారంభమవుతుంది. 6 గంటలకు గెరిగ ఊరేగింపు జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు పాండవ, కౌరవుల జనన ఘట్టంపై హరికథా కాలక్షేపం ఉంటుంది. రాత్రి 8 గంటలకు పులి వాహనంపై ద్రౌపదీ దేవి సమేత అర్జునస్వామి ఊరేగనున్నారు.

యథేచ్ఛగా సై‘ఖతం’

- రీచ్ లేకున్నా ఇసుక అక్రమ రవాణా
- రాత్రి..పగలు తేడా లేకుండా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



తెరణి శ్మశాన వాటిక వద్ద ట్రాక్టర్‌లోకి ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

నగరి : ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుకను స్టాక్ పాయింట్ల నుంచే తీసుకోవాలంటూ కొత్త నిబంధనలు జారీ చేసింది. మరెక్కడ ఇసుక తవ్వినా.. తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఉత్తుత్తి హెచ్చరికలు జారీ చేసింది. అవి కాగితాలకే పరిమితంకావడంతో ఇసుక తరలింపు మాత్రం అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా మండలంలోని తెరణి పంచాయతీ, మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట వద్ద కుశస్థలి నదిలోని ఇసుకను తరలించేస్తున్నారు. ఇప్పటికే బుగ్గ అగ్రహారం నుంచి ఏకాంబరకుప్పం వరకు వాల్టా చట్టాన్ని కూడా లెక్కచేయకుండా ఇసుక తవ్వేయడంతో లోపల మట్టి బయట పడింది. పూర్వం స్వచ్ఛమైన ఇసుక, నీటితో కళకళలాడుతూ ఉన్న నది నేడు ముళ్లకంపలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ఇప్పటికే తెరణి, కేవీపీఆర్ పేట ప్రాంతాల్లో పరిమితికి మించి ఇసుక తరలించేశారు. కొన్ని నెలల క్రితం నగరిలో ఆయా ప్రాంతాలను పరిశీలించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సెబ్, ఎక్సైజ్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, రవాణా శాఖల అధికారులు నగరి మండలంలో వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలు జరగకూడదని ఆదేశించారు. అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ కారణంతోనే జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన ఇసుక స్టాక్ పాయింట్లలో నగరిని చేర్చలేదు. అయితే వారి దారి వారిదే మా దారి మాదే అంటూ టీడీపీకి చెందిన ఇసుకాసురులు తమ పని తాము చేసుకుపోతున్నారు. నిబంధనలతో సంబంధం లేకుండా యథేచ్ఛగా ఇసుక తరలించేస్తున్నారు. చివరకు శ్మశాన వాటికలకు వెళ్లే దారిని కూడా వదలకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. దీనిపై తెరణి గ్రామానికి చెందిన యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా ఇసుక తరలింపు కొనసాగితే భూగర్భ జలాలు అడుగంటి పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కమ్యూనిస్టు పార్టీలు కూడా నిరసనలు వ్యక్తం చేస్తూ, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోతున్నారు.

గిరిజన విద్యార్థుల ఉన్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజన విద్యార్థుల ఉన్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌ఓ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. చదువుకోవడం వల్ల వారి జీవన విధానంతో పాటు స్థితిగతులు మెరుగుపడుతాయని వెల్లడించారు. గిరిజన కుటుంబంలోని పిల్లలందరినీ బడికి పంపించి చదివించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు.. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ గిరిజనులు సమాజానికి దూరంగా అడవుల్లో, కొండ కోనల్లో ఉంటూ అభివృద్ధికి నోచుకోకుండా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి సమస్యలున్నా ఉన్నతాధికారులను సంప్రదించాలని కోరారు. మేయర్ అముద మాట్లాడుతూ చైతన్యంతో అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు గిరిజనులు మాట్లాడుతూ తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చిత్తూరులో గిరిజన భవనం ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, పలు శాఖల అధికారులు పద్మనాభం, రాజ్యలక్ష్మి, నాయకులు రఘురామ్, చిరంజీవి, కృష్ణనాయక్, మునీంద్రనాయక్ పాల్గొన్నారు.

కాస్త నెట్టండయ్యా..!



చిత్తూరుకు చెందిన వృద్ధ దంపతులు నగరంలోని పెద్దాస్పత్రికి వచ్చారు. దేవుడి మీద భారం వేసి అంతా వైద్యసిబ్బంది చూసుకుంటారని నమ్మి శుక్రవారంవచ్చారు. తీరా ఆదిలోనే స్వాగతం పలికిన కష్టాలను చూసి దిగాలుపడ్డారు. మధుమేహంతో కాళ్లు దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్న భార్య నాగభూషణమ్మను తీసుకుని లోపలికి ఎలా వెళ్లాలో అర్థంకాక ఆమె భర్త అయోమయానికి గురయ్యారు. ఆస్పత్రి సిబ్బంది చూసీ చూడనట్లు వెళుతుంటే ఆందోళన చెందారు. చివరకు వీల్‌చెయిర్ తీసుకువచ్చి భార్యను అందులో కూర్చోబెట్టారు. పాపం ఆ బక్కచిక్కిన భర్త ఆ వీల్‌చెయిర్‌ను తోసుకుని వెళ్లలేక నానా అవస్థలు పడ్డారు. అటుగా వచ్చేవారిని కాస్త నెట్టండయ్యా అంటూ వేడుకున్నారు. ఇదంతా గమనిస్తున్న పలువురు రోగులు ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు.

– చిత్తూరు రూరల్(కాణిపాకం)